క్లుప్తంగా

అత్తాపూర్‌లో శ్యాంబాబా యాత్ర ప్రారంభం



యాత్రలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ నుంచి కాచిగూడ శ్యామ్ బాబా ఆలయం వరకు యాత్ర ప్రారంభమైంది. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్ రామాలయం నుంచి ఈ యాత్ర బయలుదేరింది. మూడు రోజుల క్రితం రాజస్థాన్‌లో శ్యాంబాబా మందిరం నుంచి హైదరాబాద్ రాంబాగ్ రామ మందిరం ప్రాంగణానికి తెచ్చిన శ్యాంబాబా జెండాకు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించారు. శుక్రవారం జెండాను కాచిగూడలోని శ్యాంబాబా మందిరంలో సమర్పించేందుకు భక్తులు ర్యాలీగా బయలుదేరారు. అడుగడుగునా వారికి బీజేపీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు తాగునీరు, ఆహారపదార్థాలు అందజేసి సేదతీరుస్తున్నారు.

యోగాతోనే ఆత్మవిశ్వాసం

బండ్లగూడ: యోగాతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. శుక్రవారం బండ్లగూడలోని విజ్ఞాన్ కళాశాలలో యోగా తరగతులను నిర్వహించారు. బ్రహ్మకుమారిస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యోగా తరగతులకు ముఖ్య అతిథిగా గౌరీ సతీష్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా యోగా ఎంతగానో తోడ్పడుతుందని విద్యార్థులు తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు.

తజకిస్తాన్ యూనివర్సిటీతో సీబీఐటీ ఒప్పందం



మణికొండ: సీబీఐటీ తజకిస్తాన్‌కు చెందిన ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ టూరిజం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, తజకిస్తాన్ యూనివర్సిటీ డైరెక్టర్ అస్టోర్డోదా ఉబైదుల్లాలు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు కళాశాలలు విద్య నిర్వహణ, శాస్త్రీయ పరిశోధన, వ్యవస్థాపక కార్యకలాపాల్లో పరస్పర సహకారం అందించుకుంటామన్నారు. డాక్టర్ టీఎస్ పూర్ణచంద్రిక, ప్రొఫెసర్ ఉమాకాంత్ చౌదరి, డాక్టర్ థమన్‌జీత్, డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్, కేశవ బాలాజీరావు, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి



రాజేంద్రనగర్: సీనియర్ విద్యార్థి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న మెడికో ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మహత్యకు పాల్పడేలా హింసించిన సైఫ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో విద్యార్థులపై రోజు రోజుకు వేధింపులు ఎక్కువవుతున్నాయని మెడికో ప్రీతి మృతిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శక్తి కేంద్ర సహ ఇన్‌చార్జ్ బూత్ అధ్యక్షుడు దుర్గప్రసాద్, చరణ్‌ప్రసాద్, సంతోష్, రామమూర్తి, సుందర్, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన వంటగ్యాస్ ధరలతో పేదలపై భారం



మణికొండలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



శంషాబాద్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

మణికొండ: దేశంలో గ్యాస్ ధరలను ఇష్టారాజ్యంగా పెంచితే పేదలకు ఎలా బ్రతకాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డిలు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తా వద్ద పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కట్టెల పొయ్యిపై వంట చేశారు. ధరలను పెంచుకుంటూ పోతే పేద ప్రజలు కనీసం వంట చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రజలు గతంలో మాదిరిగానే తిరిగి కట్టెల పొయ్యిలను వాడి ఆరోగ్యాలను పాడు చేసుకోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలర్లు వసంతరావు, నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయకులు జయరాజ్, బషీర్, లక్ష్మయ్య, శ్రీకాంత్, కుమార్, దిలీప్, విజయలక్ష్మి, లత, శివగంగ, డాక్టర్ ప్రభావతి తదితరులున్నారు.

ధరలను అదుపు చేయడంలో కేంద్రం విఫలం..

రాజేంద్రనగర్: గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచడంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం శివరాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ మోయలేని భారం మోపుతుందని ఆరోపించారు. ధరలను అదుపు చేయడంలో కేంద్రం ఇటూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సిలిండర్ ధరలు గుబులు పెట్టిస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడమే తప్ప ధరలను అదుపులోకి తీసుకురావడం లేదన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించి ధరలను తగ్గించాలన్నారు.

పెద్దలకు దోచిపెడుతున్నారు..

శంషాబాద్: వాణిజ్య వేత్తలకు దోచి పెడుతున్న కేంద్ర ప్రభుత్వం మరో వైపు పేదల బతుకులపైన భారం పెంచుతోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విమర్శించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు, పేద, మధ్యతరగతి ప్రజల జీవనానికి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌తో పాటు వాణిజ్య సిలిండర్ ధర కూడా పెరగడంతో చిరు వ్యాపారులు బతకలేని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను తగ్గించడంతో పాటు సబ్సిడీలను సైతం ఎగ్గొడుతోందన్నారు. ధరల పెరుగుదలతో పేద ప్రజలకు కట్టెల పొయ్యే దిక్కుగా మారే పరిస్థితి ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఆర్. గణేష్ గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, జహంగీర్, అజయ్, టీఆర్‌ఎస్ నాయకులు మురళి, సురేష్, శ్రీనివాస్, ప్రభాకర్, మోహన్‌రావు, హన్మంతుముదిరాజ్ తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఏకం కావాలి..

బండ్లగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ బండ్లగూడ ఫార్మేష్ హోటల్ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. వంట గ్యాస్ పైన కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచి పేద, మధ్యతరగతి ప్రజల ఉసురు పోసుకుంటుందన్నారు. మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, నాయకులు పాపయ్యయాదవ్, నాగరాజు, సయ్యద్ ఖాజా, సుమన్‌గౌడ్, సాయిబాబాగౌడ్ తదితరులున్నారు.

పేదలకు అందకుండా గ్యాస్ సిలిండర్..

శంషాబాద్: గత ఎనిమిదేళ్లుగా సిలిండర్ ధరను పేద ప్రజలకు అందకుండా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం పేదల కడుపుకొడుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో పెరిగిన గృహ, వాణిజ్య సిలిండర్ ధరలకు నిరసనగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో బడా వాణిజ్య వేత్తలకు లాభం చేసే పథకాలు మాత్రమే ఉంటాయని ప్రజలకు బాగు చేసే పనులు మాత్రం ఉండవని ఆరోపించారు. టీపీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు జల్లపల్లి నరేందర్, సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్, శేఖర్‌గుప్తా, జహంగీర్‌పాషా, బొబ్బిలి శేఖర్, శంషుద్దీన్, శ్రీధర్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్, బాల్‌రాజ్, ధనుంజయ్, జక్కుబాయి, ఖలీద్, నవీన్, నజీర్, సూరజ్, చందు, విక్కి, ఉమామహేష్, అభిషేక్, మణికంఠ అజయ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



ధర్నాలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు

ముదిరాజ్ భవన నిర్మాణ పనులు ప్రారంభం

మణికొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు జరిగేలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ కేంద్రంలోని 7వ వార్డులో కౌన్సిలర్ అరుణజ్యోతితో కలిసి ముదిరాజ్ సంక్షేమ సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కులాల వారికి స్థలాలు ఉన్న చోట భవనాలను నిర్మిస్తే అవి వారి సామూహిక కార్యక్రమాలకు ఉపయోగపడతాయన్నారు. తమ కులాలకు స్థలాలు ఉన్న వారు కౌన్సిలర్‌ల దృష్టికి తీసుకెళ్తే నిధులను కేటాయించి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజుయాదవ్, ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులున్నారు.

దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా బీజేపీదే విజయం




అంబేడ్కర్ చౌరస్తాలో..

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే దేశమంతా బీజేపీకి పట్టం కడుతున్నారని ప్రతీ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తున్నాయని ఆ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. త్రిపుర, నాగాలండ్, మేఘాలయ మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాబురావు, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు సదానందం, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, రాజేంద్రనగర్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ సోల్కర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి క్రాంతి, జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు, డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు రాకేష్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మావతి, రమాకాంత్, మల్లేష్, సాయియాదవ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో బీజేపీ విజయోత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి పాల్గొని ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించి మూడో రాష్ట్రంలో కూడా హంగ్ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రధాని సుపరిపాలన చూసి దేశ ప్రజలంతా బీజేపీకి పట్టం కడుతున్నారన్నారు. వెంకటేష్, వాసు, మూసి ప్రక్షాళన కమిటీ కన్వీనర్ జయానంద్‌రెడ్డి, మణికంఠ, అరుణ్‌యాదవ్, సతీష్, లక్ష్మి, వింధ్యారెడ్డి, శేఖర్, మనోహర్, మోహన్, జగన్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

నగదుతో ఉడాయించిన సెక్యూరిటీ గార్డు

శంషాబాద్: ఫంక్షన్‌హాల్‌లో లాకర్‌ను విరగొట్టి సెక్యూరిటీ గార్డు పరారైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న అసద్ అలీ గురువారం మధ్యాహ్నం ఫంక్షన్ హాల్‌కు వచ్చాడు. అప్పటికే అతడి గది తలుపులకు ఉన్న తాళం విరగొట్టి ఉండగా.. లోపలికి వెళ్లి చూసే సరికి లాకర్ విరగొట్టి ఉండటాన్ని గమనించాడు. లాకర్‌లోని రూ. 3 లక్షలు లేకపోవడంతో సెక్యూరిటీ కోసం ఆరా తీశారు. సెక్యూరిటీ గార్డు ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో పాటు ఇతర ఆధారాలతో అతడే పగలగొట్టినట్టు పోలీసులు నిర్ధారించారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిందితుడు అస్సాం పారిపోయినట్లు సమాచారం.

విద్యార్థి అదృశ్యం



జశ్వంత్ (ఫైల్)

మణికొండ: స్కూల్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన ఓ విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా అదృశ్యమైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఖానాపూర్ గ్రామానికి చెందిన మాణిక్యం కుమారుడు జశ్వంత్ స్థానిక విద్యావికాస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం 8.40 గంటలకు ఇంట్లో నుంచి స్కూల్‌కు వెళ్తున్నానని బ్యాగు తీసుకుని వెళ్లాడు. పాఠశాలకు రాలేదని తండ్రికి టీచర్‌లు మధ్యాహ్నం 12 గంటలకు ఫోన్ చేశారు. దీంతో అతడు భార్యకు ఫోన్ చేయగా.. ఆమె కుమారుడు స్కూల్‌కి వెళ్లాడని చెప్పింది. సాయంత్రమైనా కుమారుడు ఇంటికి రాకపోవటంతో శుక్రవారం విద్యార్థి తండ్రి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమారుడి వద్ద సెల్‌ఫోన్ ఉందని ప్రస్తుతం అది స్విచ్ ఆఫ్ చేసి ఉందని పోలీసులకు తండ్రి వివరించాడు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



తృణధాన్యాలపై విద్యార్థుల ర్యాలీ

ఏజీవర్సిటీ: తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా. సత్యనారాయణ అన్నారు. పురాతన కాలంలో మన పూర్వీకుల ఆహారంలో తృణధాన్యాలు ఉండేవని భారతీయ తృణధాన్యాల పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ తారా సత్యవతి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, తృణధాన్యాల పరిశోధన సంస్థ సంయుక్తంగా తృణ ధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి, గోధుమలతో పాటే తృణధాన్యాలు చేర్చడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులు, ఆధ్యాపకులు మిల్లెట్ శాస్త్రవేత్తలు విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి మిల్లెట్ పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్)వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తృణధాన్యాలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. న్యూట్రిహబ్ సీఈఓ దయాకర్, కోరమండల్ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, వర్సిటీ అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాత్విక్ మృతికి కారణమైన వారిని శిక్షించాలి



నిరసన చేపడుతున్న న్యాయవాదులు

మణికొండ: ఇంటర్మీడియట్ విద్యార్థి మృతికి కారణమైన లెక్చరర్లు, కళాశాల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శరద్‌సింగ్ ఠాకూర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నార్సింగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడలిలో సాత్విక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలలు చేర్చుకునే సమయంలోనే పరీక్షలు పెట్టి ఉత్తమ విద్యార్థులను చేర్చుకోవటం వారిని మరింత ఒత్తిడి చేసి ఎక్కువ మార్కులు సాధించాలని ఒత్తిడి చేస్తూ కర్మాగారాల కన్నా హీనంగా మారిపోయాయన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడిలేని చదువులు ఉండాలని కొట్టడం, తిట్టడం చేయవద్దని విద్యా హక్కు చట్టం స్పష్టం చేస్తుందన్నారు. ఎలాంటి ఆట, పాటలు లేకుండా మెలకువ ఉన్న సమయమంతా చదువులకే కేటాయించటం నేరమన్నారు. ఇలాంటి సమస్యలపై భవిష్యత్తులో తాము పోరాటం చేస్తామని నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. డివిజనల్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రణయ్, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాజశేఖర్‌కు సన్మానం

శంషాబాద్: సరైన సమయంలో స్పందించి గుండెపోటు బాధితుడికి సీపీఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్ రాజశేఖర్‌ను లిమ్స్ ఆస్పత్రి బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆస్పత్రి ఎండీ రామ్‌రాజ్ మాట్లాడుతూ.. రాజశేఖర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి అతడి ప్రాణాలు కాపాడిన తీరు అందరికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. సీపీఆర్‌పై నేటి యువత అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. డాక్టర్ శంకర్‌రెడ్డి, గోవర్ధన్, ప్రవీణ్‌యాదవ్, స్మిత, అనిల్, నితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, శివపురికాలనీకి చెందిన మల్లికార్జున్ గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. అతడి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. గురువారం చెక్కు మంజూరు కాగా.. శుక్రవారం ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధ్యక్షులు శ్రీరాములు, నర్సింహ, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు శ్రవణ్‌కుమార్, రాఘవేందర్, కుమార్ తదితరులున్నారు.

కలిసికట్టుగా పండుగలను నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అత్తాపూర్, నార్సింగి, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని హిందూ, ముస్లిం, సిక్కు సోదరులు పాల్గొనగా.. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకుంటూ సోదరభావంతో ఉండాలని సూచించారు. హోళీ రోజున సిక్కు సోదరులు భారీ ఊరేగింపు నిర్వహిస్తారని అందరూ దీనికి సహకరించాలన్నారు. ఈ పండుగను హిందూ సోదరులు ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించకూడదని సూచించారు. ప్రార్థన మందిరాలు, రోడ్లపై రంగులు ఆడవద్దని ఎలాంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, క్రాంతికుమార్ తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రెవెన్యూ పరిధిలోని బుద్వేల్ మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షెడ్లు, ప్రహరీలను అధికారులు కూల్చి వేశారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కూల్చివేత పనులను చేపట్టారు. బుద్వేల్ కిష్టమ్మగుట్టతో పాటు మూసి పరివాహక ప్రాంతంలో షెడ్లు, ప్రహరీలను నిర్మించగా.. స్థానికుల ఫిర్యాదుతో వీటిని కూల్చివేశామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.



ముగిసిన నాగబింబ ప్రతిష్ఠాపనోత్సవాలు



బండ్లగూడ: పద్మశ్రీహిల్స్‌లోని పోచమ్మ దేవాలయంలో నాగబింబ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ముగిశాయి. మార్చి 1 నుంచి 3 వరకు నిర్వహించిన మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఈ కార్యక్రమానికి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోలాహలంతో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య దైవభక్తి నిండుకుంది. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. పాపయ్య యాదవ్, కిషోర్ తదితరులున్నారు.

ప్లాట్లు ఇప్పిస్తానని చెప్పి రూ. 80 లక్షల టోకరా

మూడు గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



పట్టుబడిన నిందితుడు రవి

శంషాబాద్: నగదుతో ఉడాయించిన ఓ రియల్టర్‌ను పోలీసులు మూడు గంటల వ్యవధిలో వెంబడించి పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. షేక్‌పేట్ ఓయూ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ స్థానికంగా నివసించే సంతోష్ అనే వ్యక్తి ద్వారా ముంబాయి బీవాండిలో నివాసం ఉండే రవి పరిచయం అయ్యాడు. షేక్‌పేట్ సక్కుబాయి కాలనీలో ప్లాట్ నంబర్లు 9, 10 విక్రయించేందుకు తెలిసిన యజమానులు ముంబాయిలోనే ఉన్నారని వారితో రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు రూ.20 లక్షల చెక్కును విజయ్ అతడికి ముంబాయిలో అందజేశాడు. విజయ్‌తో పాటు మరో వ్యక్తి శ్రీధర్ కూడా ప్లాటు కొనేందుకు సిద్ధం కాగా.. రిజిస్ట్రేషన్ చేయించాలని రవిని కోరారు.

- మూసాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుందామని ప్లాట్లకు సంబంధించిన పూర్తి మొత్తాన్ని తీసుకుని గురువారం మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిందిగా రవి కొనుగోలుదారులైన విజయ్, శ్రీధర్‌లకు చెప్పాడు. వారిద్దరు సంతోష్‌తో కలిసి రూ.80 లక్షల నగదు తీసుకుని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.
- ప్లాట్ల యజమానులు వెనకాల వస్తున్నారు. మనం మూసాపేట రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్దామని చెప్పి తన కారులో ఎక్కించుకుని తొండుపల్లి టోల్‌ప్లాజాకు వచ్చిన తర్వాత టీ తాగుదామని చెప్పి ముగ్గురిని దిగమని చెప్పాడు. టీ తాగేందుకు ముగ్గురు వ్యక్తులు దిగిన మరుక్షణమే రవి కారుతో అక్కడి నుంచి ఉడాయించాడు.
- బాధితులు వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఓటీ, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. రాచకొండ పోలీసులకు కూడా సమాచారం అందించడంతో ఫోన్ నంబర్లు, కారు నంబరు ఆధారంగా నిందితుడిని ఘట్‌కేసర్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేయడంతో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పోలీసులను అభినందించారు.

ఔటర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన టాటా ఏస్ .. ఒకరి మృతి

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తా పడింది. పెద్ద అంబర్‌పేట వద్ద ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కిన వాహనం గచ్చిబౌలి వైపు వస్తుంది. అందులో డ్రైవర్ లింగేశ్వరయ్యతో పాటు నాగయ్య ముందు కూర్చోగా వెనక మరో గుర్తు తెలియని వ్యక్తి ఉన్నాడు. అది పల్టీ కొట్టడంతో వెనక ఉన్న వ్యక్తి ఎగిరి దూరంగా పడటంతో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు కూర్చున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావటంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు మేలు'



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ ఉషారాణి తదితరులు

మణికొండ: పేదలకు మేలు చేసేవి కాంగ్రెస్ ప్రభుత్వాలేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను నివాళులు అర్పించి గండిపేట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.50 గ్యాస్ ధరలను పెంచితే అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా దాన్ని ప్రభుత్వమే భరించిందన్నారు. గత 9 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజలపై మోయలేని భారం వేస్తోందన్నారు.

- కేంద్ర ప్రభుత్వంతో పోటీగా రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇష్టానుసారంగా పోటాపోటీగా పన్నులు వేసి ఖజానా నింపుకుంటుందని ఆరోపించారు.
- రెండు ప్రభుత్వాలు ప్రజల మేలు కన్నా తమ ఖజానాలు నింపుకునేందుకే కృషి చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాజస్థాన్‌లో మాదిరిగా రూ. 500లకే సిలిండర్‌ను అందిస్తామన్నారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు అశోక్, గండయ్య, కిరణ్‌కుమార్, యాదగిరి, కౌన్సిలర్‌లు విజయ్‌బాబు, ఉషారాణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.